# ఇదియశాస్త్రీయమా?

శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మగారు బి. ఏ.

౧

పేరు భానుమతి. కాని కళలుతప్పి మేఘముచే కప్పబడిన భానుని వగది నున్నది. ఈమె కిప్పుడు పదునెనిమిది సంవత్సరములు. చిన్నతనముననే భానుమతికి వివాహము మాత్రముచేసి తల్లిదండ్రులు పరలోకమునకు తరలిపోయిరి. అక్కగారును, అన్నగారును ఆమె కిప్పుడు దిక్కు. అన్నగారు హిందూమతమును, హిందూదేశమును వీడి బౌద్ధమతమును స్వీకరించి సింహళద్వీపమున జీవించుచున్నాడు. ఆకారణమున భానుమతి తప్పనిసరిగా అక్కగారి అండకు చేరవలసి వచ్చినది. అక్కమొగుడు అంత ధనవంతుడు కాడు. పొయ్యిమీద కుండఎక్కడమే కష్టముగాఉన్నది. మంచివాడు కాబట్టి భానుమతిని కడుపులో పెట్టుకొన్నాడు. ఆమెకు విద్యాబుద్ధులు చెప్పించి గొప్పదానినిగా చేయవలెనని అతనికి సంకల్పమున్నను సమర్థతలేదు. కాబట్టి ఈమె వారింట పనిచేయుట వారీమెకు పట్టెడన్నము పెట్టుట. ఇట్లు దినములు గడచిపోవుచున్నవి. గడచిపోవుటలో సవ్యతకు కొంతభంగము కల్గుటమాత్రము లేకపోలేదు. కాకులవంటిలోకులు ఆమె భర్తనుగూర్చి ప్రశ్నింప నారంభించిరి. ఆమెకు భర్తఉండెనా? లేడా? అను మీమాంస చేయజొచ్చిరి.



పెద్దాడ కామేశ్వరమ్మగారు

౨

నిజమునకు భానుమతికి భర్తఉన్నాడు. జ్ఞానమువచ్చిన తరువాత ఆమె భర్త మొగముచూచి యుండలేదు. కట్టుకున్నభార్యకు దర్శనమిచ్చుటకు ఆమెభర్తకుకూడ తలంపులేక పోయినది కాబోలును. ఇంతకును అతనికి ఈమెమీద ఇష్టములేదా? ఇష్టములేనట్లె కనిపించుచున్నది. భానుమతి బావగారికి అతడొకసారి హఠాత్తుగ కనిపించినాడు. ఈవిషయమై ప్రశ్నింపగా మొగము చిట్లించుకొన్నాడు. అనిష్టత సూచించు పలుకులెన్నో పలికినాడు. ఇక నామెకు గతియేమి అని భానుమతి బావగారు ఆమె భర్తను ప్రశ్నించినాడు. "ఆమె దిక్కున నామనము ప్రేమపరీతముకాలేదు. కాదుకూడ. వలయుచో ఆమె తిరిగి వివాహము చేసికొనవచ్చును. ఇదే నాఅనుజ్ఞాపత్ర మిచ్చుచున్నాను." అని భాను

మతి భర్త బదులుపలికెను. భానముఖమున ఈవార్త నాలించి ఆశాలేశము అడగాఱి పోవగా భానుమతి శూన్యహృదయముతో గోడకు జేరబడియెను.

## ౩

భానుమతి అక్కగారికి ప్రబలరోగము ప్రాప్తించెను. అన్నగోపాలరావుని చూడ వలయునని చెప్పెను. టెలిగ్రాము ఇచ్చిరి. సింహాళమునుండి ఆతడువచ్చెను. ఆతడు వచ్చిన తోడనే జెంగతీరియో యేమో భానుమతి అక్కగారికి క్రమముగా ఆరోగ్యము కల్గెను. ఆరోగ్యమును కోల్కొని ఆమె భానుమతి భవితవ్యమును గూర్చి అన్నతో ఆలోచించెను. ఆతడామెను తనతో తీసికొని పోవుటకు ఉబలాటపడెను. ప్రయాణ సన్నాహములు తీరినవి. పోవుటకు ముందు గోపాలరావు భానుమతి భర్తదగ్గఱనుంచి ఆమె తిరిగి వివాహము చేసికొనుట ఆతనికి సమ్మతమని పత్రముగ్రాయించి పుచ్చుకొనెను. సోదరీద్వితీయుడై గోపాలరావు సింహాళము చేరెను.

## ౪

గోపాలరావు:—భానూ! నీవేమి చేసెదవమ్మా? స్కూలుకు పోలేనంటున్నావు. చదువు కొనుటకు వయస్సుమీఱుటమేమి? ఇంతకును నీకేదో జీవనోపాధియుండ వలెను గదా? ఎల్లకాలము నేను మాత్రము శాశ్వతమా? నీవిట్లు సర్వదావిచార గ్రస్తవై యుండుటకన్న తిరిగి వివాహముచేసికొనుట మంచిదికాదా?

భానుమతి:—అన్నయ్యా! ఎంతమాటంటివి. హిందూస్త్రీనగు నేను పునర్వివాహ మెట్లొనర్చు కొనగలను. హిందూస్త్రీ పుట్టునదొకసారి. పెండ్లాడునదొక్కసారి. మరణించునదొక్కసారి. పాతివ్రత్యమునకు అతిలోకమైన మన్ననలగన్న హిందూ జాతియందు ఆవిర్భూతనైన నేను తిరిగి వివాహము ఆడుట ధర్మవిరుద్ధముకాదా?

గోపాలరావు:—చెల్లీ! నీవు చాల అజ్ఞానదశలో నున్నావు. మన స్త్రీలకుగాని పురుషులకు గాని తగినంత విద్యలేకపోవుటచే నూతనభావములు కలుగకున్నవి. శాస్త్ర ములకేమి? వానిని భగవంతుడు వ్రాయలేదుగదా! ఆయాకాలముల కను గుణ్యముగ మనుష్యులే వానిని వ్రాసిరి. అవి మనుష్యునకొఱకు వ్రాయబడి నవి గాని వానికొఱకు మనుష్యుడుగాడు. అయినను వానిని బాగుగ చదివి అందలి అంతరార్థమును గ్రహించిన మహాశయులెవ్వరు? నీవిట్టి దుర్గతికి పాత్రవై యుండుట ఏశాస్త్రప్రకారము ధర్మమగును? 'నాకీభార్య అక్కరలేదు.' అని భర్తవిసర్జింపగా—అన్యాయముగ, అకారణముగ విసర్జింపగా—ఆస్త్రీ తిరిగి

వివాహమాడుట ఏశాస్త్రప్రకారము నిషిద్ధమగును? కాబట్టి ఇందు ధర్మాతిశేక మేమియు లేదు. నీ వేమియు జంకవద్దు. భయపడవద్దు. నామిత్రులలో మంచి వాని నొకని వరించి సుఖియింపుము.

భానుమతి:—అన్నా! నాకు నోరు తాళము వేసికొని పోయినది. నీవు చెప్పినది వినజాలను. పునర్వివాహపు తలంపు మనమున నెల కొల్పుటయే పాపమని భావింతును. నాకెన్నడును తిరిగి వివాహమాడవలయునను తలంపు కలుగనే లేదు. అయినప్పటికి అక్కగారి యూరిలోని జనులు నన్నుగూర్చి పలువిధములగు దుర్భాషలాడుచుండెడివారు. అవి నాచెవులకు చేరినపుడు ఒళ్లు రణకంపర మెత్తెడిది. ఏడ్చెడిదానను. దానికేమిగాని అన్నా? తిరిగి వివాహము చేసికొనినచో నన్నందఱును ఆడిపోయురా?

గోపాలుడు.—అమ్మాయీ! ఈప్రపంచమున నందఱిని మెప్పించుటయు—తుదకు నొప్పింపకనైన నుండుటయు నెవరికిని తరముగాదు. ఈ ప్రపంచమున సుఖముగా జీవించుటకు నీకు హక్కుగలదు. పురుషు లెంతమట్టుకు వారి స్వలాభము చూచుకొనుటయేగాని స్త్రీలకష్టములను తొలగించుటకు ఎక్కువ ప్రయత్నము చేయరు. శాస్త్రములు వారికెక్కువ యనుకూలముగానున్నవి. అందుచే వారికే బాధలు తెలియవు. నీవు పునర్వివాహమునకు అంగీకరించి ఆచరించినచో నీవలె బాధపడుచు కోటానకోట్లుగనున్న భారత స్త్రీలకందఱకు మార్గముచూపిన దానవగుదువు. కావున తప్పక నీవు తిరిగి వివాహమాడుము.

కొన్నిదినములకు భానుమతి పూర్ణభాను తేజముగలిగి యొకయువకునితో నొక నాటి సాయంకాలము సముద్రపు టొడ్డునకు షికారువచ్చినది. ఆమెనుచూచిన వారి కందరకు నమితానందము కలిగి సర్వసుఖములతో గూడిన నిట్టి ప్రపంచము సృజించిన సృష్టికర్త యెంతయు సంస్తవనీయుడని తలప నారంభించిరి. భానుమతి వెనుకటి దుఃఖమును మఱచి మహానందమున నోలలాడుచున్నది. సంతోషజీవనము చేయుటకు ప్రతిమానవునకు హక్కుగలదు. అట్టిచో భానుమతి అనురూపవరలాభమును పొంది సుఖించుట అశాస్త్రీయమా?